క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాల్లో ప్రసిద్ధి గాంచిన బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలక వర్గ సభ్యులు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, సిబ్బందిఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొన్నాడ రాము మృతి తీరని లోటు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న గోపాలన్

నరసాపురం: సీపీఎం పట్టణ నేత పొన్నాడ రాము మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జేఎన్వీ గోపాల్ అన్నారు. పొన్నాడ రాము సంస్మరణ సభను ఆదివారం పట్టణంలోని 22వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ బాబాయ్‌గా సుపరిచితుడైన రాము చిన్ననాటి నుంచి సీపీఎం కోసం పేదల పక్షాన పని చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, కవురు పెద్దిరాజు, పాగాకు నారాయణరావు, పాగాకు పూర్ణ పాల్గొన్నారు.

ఘనంగా వ్యాకుల మాత గ్రామోత్సవం



పెనుగొండలో వ్యాకుల మాత గ్రామోత్సవం

పెనుగొండ: వ్యాకుల మాత గ్రామోత్సవం పెనుగొండ చెరుకువాడలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం వ్యాకుల మాత జయంతి సందర్భంగా ఉదయం నుంచి చెరుకువాడ ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి, అనంతరం గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గంగాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పచ్చని పంట పొలాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న ఎల్బీచర్ల గంగాలమ్మ ఆలయానికి మొక్కుబడులు, నైవేద్యాలను సమర్పించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు తెలిపారు. గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు పేద విద్యార్థినులకు ఆదివారం సాయం అందజేశారు. పేద ఇంజనీరింగ్ విద్యార్థిని సత్యవాణికి కళాశాల బస్సు ట్రాన్స్‌పోర్టు నిమిత్తం, పుస్తకాలకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని ఆర్గనైజేషన్ ట్రస్టీ, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నా జనార్దనరావు అందజేశారు. మరో విద్యార్థిని మధుప్రియకు సైకిల్ అందజేశారు.కార్యక్రమంలో ఉమా, దుర్గా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లు నూతన ఆవిష్కరణలు సృష్టించాలి

నరసాపురం రూరల్: మారుతున్న అవసరాలకు అనుగుణంగా సాంకేతిక సృజనాత్మకను జోడించి నిత్య జీవితంలో జనావళికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను ఇంజనీర్లు సృష్టించాలని పంచాయతీరాజ్ డీపీఆర్ ఈవో కేఎస్ఎస్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేస్వరయ్య జన్మదినోత్సవాన్ని పురష్కరించుకొని ఇంజనీర్స్ డే వేడుకలను స్థానిక పంచాయతీరాజ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ ఆరేపల్లి నర్సింగరావు బహుకరించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోక్షగుండం గురించి పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో డీఈఈ లు కల్వకొలను స్వామి, డి.రాంబాబు సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

- పెరిగిన ధరలతో వినియోగదారుల గగ్గోలు
- హడలెత్తిపోతున్న హోటల్ నిర్వాహకులు



దొంగరావిపాలెం టోకు మార్కెట్‌లో ఉల్లి అమ్మకాలు

పెనుగొండ: ఉల్లి కోస్తే కన్నీరు వస్తుంది. కాని కోయకుండానే ఉల్లి కొనుగోలుదారుల కంట కన్నీరు పెట్టిస్తోంది. నెలరోజుల వ్యవధిలో ధరలు రెట్టింపు దాటి, మరింత వేగంగా పరిగెడుతుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. ప్రజలకు నిత్యం ఆహార పదార్థాల్లో ఉల్లికి ఉన్న స్థానం మొదటి వరుసలో ఉంటుంది. దీంతో ఉల్లిపాయల వాడకం రోజు రోజుకు తగ్గించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. నెలరోజుల క్రితం కేజీ ధర రూ.20 లోపు ఉండగా, నెల రోజుల్లో రూ.60 దాటడడంతో కొనుగోలు కష్టతరంగా ఉందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌ల డిమాండ్‌కు తగ్గట్టుగా ఉల్లిపాయలు దిగుమతి కాకపోవడంతోనే ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఉల్లి వ్యాపారులు వివరిస్తున్నారు. మే, జూన్‌లలో మహారాష్ట్రలో వర్షాలు అధికంగా కురువడంతో ఉల్లి పంట మొత్తం పాడై పోవడంతోనే ఉల్లి మార్కెట్‌కు రావడం తగ్గిందని తెలిపారు. దీనికి తోడు 20 శాతానికి పైగా ఉల్లిపాయలు ఇతర దేశాలకు ఎగుమతులు అవుతుండడంతో, స్థానికంగా ఉల్లిపాయలు వినియోగానికి తగ్గట్టు అందుబాటులో లేకుండా పోతున్నాయని తెలిపారు. దీంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందంటూ వ్యాపారస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



టోకు మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉల్లిపాయలు

హోటల్ నిర్వహణ కష్టతరం

ఉల్లి ధరలు రెట్టింపు దాటి పెరుగుతుండడంతో హోటళ్ల నిర్వహణ కష్టసాధ్యంగా మారిందంటూ హోటల్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ మోస్తరు హోటల్లోనే రోజుకు 20 నుంచి 30 కేజీలకు పైగా ఉల్లిపాయల వాడకం ఉంటుందని, దీంతో ఉల్లిపాయలకే అదనంగా రూ.1000 పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. దీనికి తోడు ప్రతీ ఆహార ప్రియుడు ఉల్లిపాయ చక్రాలు అడిగే పరిస్థితి ఉండడంతో, దీనికి నాణ్యమైన ఉల్లిపాయలు ఇవ్వవలసి ఉంటుంది. ధర పెరిగిన నేపథ్యంలో ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఉల్లిపాయల ధరలు అదుపులోకి వచ్చే వరకూ నష్టాల బాట తప్పదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అట్టహాసంగా గణనాథుడి నిమజ్జనాలు



మొగల్తూరు: వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న యువకులు



పెనుమంట్ర: గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మొగల్తూరు: వినాయక చవతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో రోజు ఆదివారం మొగల్తూరులోని పలు ప్రాంతాల్లో వినాయకుడి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నెంబర్ వన్ స్కూల్ సమీపంలో వరసిద్ధి వినాయకుడిని, వర్ధమానవారి వీధిలో వినాయకుడిని గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. తీన్‌మారు డప్పులు, విచిత్ర వేషధారణలు, యువతీ, యువకుల నృత్యాలతో బాణా సంచా కాలుస్తూ స్వామి వారిని ఊరేగించి నిమజ్జనం చేశారు.

దీపోత్సవం

పెనుగొండ: సిద్ధాంతం మేడిశెట్టి వారి వీధిలో నిర్వహించిన దీపోత్సవం ఆకట్టుకుంది. గణపతి చవితి ఉత్సవాల సందర్భంగా బడేటి దుర్గా శ్రీనివాస్, నాగమణి దంపతులచే విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వీధి పొడవునా శివలింగం, త్రిశూలం, ఓం, స్వస్తిక్, గణపతి ఆకృతులలో దీపోత్సవం నిర్వహించారు. చిన్నారులు అధిక సంఖ్యలో దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు.



పెనుగొండ: సిద్ధాంతంలో దీపాలు వెలిగిస్తున్న చిన్నారులు

గణపతికి ప్రత్యేక పూజలు

గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పెనుగొండ, ఆచంట మండలాల్లోని గ్రామాల్లో గణపతి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం జవ్వాది వారి వీధిలో సామూహిక గణపతి పూజలు నిర్వహించారు.

లడ్డూ వేలం

ఆచంట మండలం కరుగోరుమిల్లి ముత్యాల వారి పాలెంలో విజయ గణపతి మహోత్సవాలు వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పోటాపోటీగా సాగింది. యాతం నాగరాజు, హైమావతి దంపతులు రూ.1.35 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు.

బైబై గణేశా..

పెనుమంట్ర: గణపతి నవరాత్రులు సందర్భంగా ఆదివారం ఊరేగింపులు, నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెనుమంట్రలోని పల్లపు వీధి రెడ్డి యూత్, రామాలయం యూత్ శ్రీలక్ష్మి గణపతి ఆలయ కమిటీల ఆధ్వర్యంలోనూ, మార్టేరులోని దేవాంగ సంక్షేమ సంఘం, శ్రీబాల విద్యా గణపతి ఆలయ కమిటీ, శివరావుపేటలోని శ్రీకనకదుర్గమ్మ, రామాలయ కమిటీ ఆధ్వర్యంలో గణపతి ప్రతిమలను అలంకరించిన వాహనాలపై ఉంచి, విచిత్ర వేషధారాణలతో యువకులు ఊరేగించారు. అనంతరం పంట కాలువల్లో నిమజ్జనం చేశారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

పాలకొల్లు అర్బన్: యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పోడూరు మండలం వేడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మణిపాల్, విజయవాడ ఆసుపత్రి నుంచి పలువురు వైద్య నిపుణులు పాల్గొని సుమారు 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. గుండె, ఎముకలు, చర్మ వ్యాధులు, జనరల్ మెడిసిన్, దంత వైద్య నిపుణులు పాల్గొని రోగులను పరీక్షించి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. యూకేసీ గవర్నర్ పెనుమాక రామమోహన్, అధ్యక్షుడు జక్కంపూడి మాధవ్, కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, యర్రంశెట్టి పద్మారావు, ఇనుకొండ రంగారావు, దుప్పనపూడి దొరబాబు, యర్రంశెట్టి నరసింహారావు, చెల్లబోయిన శారదాదేవి, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ నాయకులు

అనుమతులు లేవు.. నిర్మాణం ఆగదు

- అన్నదాన సమాజం భవన నిర్మాణంలో అనుమానాలు
- మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా డోంట్ కేర్
- మర్మమేమిటో దేవుడికే ఎరుక



తొలగించిన సత్రంలో గతంలో హోమియోపతి వైద్యం, ఉచిత మందులు ఇచ్చేవారు (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో దేవదాయ ధర్మాదాయ శాఖకు చెందిన క్షీరపురి అన్నదాన సత్రం నూతన నిర్మాణంలో ఎన్నో అవకతవకలు ఉన్నట్లు వినిపిస్తున్నాయి. పట్టణంలో బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఈ సత్రాన్ని దాత నున్న అప్పారావు 1912లో ఏర్పాటు చేశారు. దాత నాడు ఈ సత్రాన్ని ఎంతో సహృదయంతో పేదలకు అన్నదానం ఏర్పాటు చేయడానికి విద్యార్థులకు విద్యా సామగ్రి, అన్నదానం అందించి, విద్యావంతులుగా తయారు చేయడానికి ఎంతో కృషి చేస్తూ వచ్చింది. ఈ సత్రం ముఖ్య ఉద్దేశ్యం ప్రతీ రోజు పేద కాలేజీ విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా అన్నదానం, యూనిఫామ్‌లు, నోట్ పుస్తకాలు అందజేయడం, పేదలకు ఉచితంగా అన్నదానం, ప్రతీ మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ హోమియోపతి వైద్యులు ఎండీ చే వైద్య పరీక్షలు చేయించి, ఉచితంగా హోమియోపతి మందులు అందజేయడం, వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు, కార్తీకమాసంలో ప్రతీ సోమవారం, శివరాత్రి రోజున ఆలయానికి వచ్చే భక్తులకు ఉచితంగా పులిహోర ప్రసాదం, బాటసారులకు ఉచిత భోజనం ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలతో ఈ సంస్థ నడుపుతున్నట్లు చెబుతున్నారు. సత్రం పేరే క్షీరపురి అన్నదాన సమాజం కాని నేడు అన్నదానం, కొన్ని సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న సత్రం

క్షీరపురి అన్నదాన సత్రం స్థాపించి 112 సంవత్సరాలు కావస్తుంది. ఈ సత్రానికి చిన్న, మధ్య, పెద్ద సైజుల్లో సుమారు 63 వరకూ షాపులు ఉన్నాయి. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌కు ఉత్తరం వైపున ఓ పెంకుటిల్లు ఉండేది. ఇందులోనే అన్నదాన కార్యక్రమం, ఉచిత హోమియోపతి వైద్యం, మందులు ఇచ్చేవారు. ఆ పెంకుటిల్లును ఇటీవల తొలగించారు. అందులో లక్షలు విలువ చేసే టేకు దూలాలు ఉన్నాయి. వాటిని ఎలా టెండర్ పిలిచారు, ఎంతకు విక్రయించారనే వివరాలు మాత్రం తెలిదని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పూర్తి సమాచారం లేదు గాని స్థానికులకు తెలిసిన సమాచారం మేరకు సుమారు రూ.35 వేలకు విక్రయించినట్లు తెలిసింది. దీనిపై ఇటీవల ఈవోను కొందరు ప్రశ్నించగా పత్రికా పరంగానే టెండర్ పిలిచామని చెప్పారు. వాటి వివరాలు ఇవ్వండి అంటే ఇప్పటి వరకూ వాటిని అందజేయక పోవడం గమనార్హం. తొలగించిన పెంకుటిల్లు స్థానంలో షెడ్ నిర్మాణం చేస్తున్నారు. ఈ నిర్మాణంపై అనేక మంది మున్సిపల్, దేవదాయ ధర్మాదాయ శాఖ, పురావస్తు శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా సరే అనుమతులు లేకుండా ఇంత హడావుడిగా నిర్మాణం చేయడంపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. దీని నిమిత్తం సుమారు రూ.20 లక్షలు వెచ్చిస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చామని చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు ప్రస్తుతం విజయవాడ వరద ముంపు ప్రాంతాల్లో విధుల్లో ఉన్నారు. ఇదే అదునుగా సత్రం అధికారులు హుటాహుటిన నిర్మాణం చేయడం ప్రజల్లో అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల వివరణ

క్షీరపురి అన్నదాన సత్రం అధికారులు చేస్తున్న నిర్మాణానికి మేము ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదు. అనుమతుల కోసం సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేయలేదు. మాకు అనేక మందితో ఒత్తిళ్ల తీసుకొచ్చారు. నిర్మాణానికి కావలసిన పత్రాలు తీసుకొస్తే మేము అనుమతులు ఇస్తామని చెప్పాం. నిర్మాణం జరుగుతుందని అనేక ఫిర్యాదులు వచ్చాయి. అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు చేయకూడదని అన్నదాన సత్రం అధికారులకు నోటీసులు జారీ చేశాం. ప్రస్తుతం నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. మేము విజయవాడ వరద ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నామని మున్సిపల్ అధికారులు ఫోన్‌లో వివరణ ఇచ్చారు.



మున్సిపల్ అధికారుల నోటీసుతో నెల రోజుల క్రితం షెడ్ వేసి నిలుపుదల చేసిన దృశ్యం



మున్సిపల్ అధికారులు వరద విధుల్లో ఉండగా ఆపేసిన షెడ్డుకు గోడలు నిర్మించిన సత్రం అధికారులు

దేశం మెచ్చిన ఇంజనీర్ విశ్వేశ్వరయ్య



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న మంత్రి రామానాయుడు



ఇంజనీర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

పాలకొల్లు అర్బన్: దేశం మెచ్చిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పలువురు వక్తలు అన్నారు. పాలకొల్లు లయన్స్ క్లబ్ ఆవరణలో ఆదివారం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆర్అండ్‌బీ ఏఈ డీఎస్ఎన్ మూర్తిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పెద్దిబట్ల లక్ష్మీనారాయణ, డాక్టర్ కేఎస్‌పీఎన్ వర్మ, కారుమూరి సూర్యనారాయణ, భీమేశ్వరరావు, నూలి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లకు ఆదర్శనీయుడు విశ్వేశ్వరయ్య

భావితరాలకు, యువ ఇంజనీర్లకు ఆదర్శనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు ఇరిగేషన్ కార్యాలయంలో ఆదివారం ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి మంత్రి రామానాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పట్టణంలోని 22వ వార్డు శెట్టిపల్లివారి పేటలో రూ.4.55 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి రామానాయుడు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.

లస్కర్ల వినతి

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న లస్కర్ల సేవలను క్రమబద్ధీకరించాలని కోరుతూ మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, పాలకొల్లు నియోజకవర్గ ఎన్జీవో సంఘ అధ్యక్షుడు గుడాల హరిబాబు ఆధ్వర్యంలో ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో మంత్రిని కలిసి లస్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

మొగల్తూరు: ఇంజనీర్స్ డేను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వివేకా స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఈ కార్యక్రమంలో సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కత్తుల అప్పాజీ, పులపర్తి మణి కిరణ్‌లను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉండవల్లి గీతా రాంబాబు, కార్యదర్శి తణుకుల రామకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి ఆధునిక సాంకేతికత గల ఇంజనీర్ల సేవలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరాజు, డీటీపీ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు ఏలూరు సర్ సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 14, 15 తేదీల్లో నిర్వహించారని కోచ్ ధనాని సూర్యప్రకాష్ తెలిపారు. ఈ పోటీల్లో 14 సంవత్సరాల లోపు బాలబాలికల విభాగంలో కరాటే పోటీల్లో 17 మంది విద్యార్థులు పోటీ పడగా 17 స్థానాలు కైవసం చేసుకున్నారన్నారు. వీరిలో 13 మంది ప్రథమ, ద్వితీయ స్థానంలో 11 మంది, తృతీయ స్థానంలో 6గురు విద్యార్థులు గెలుపొందారన్నారు. అలాగే బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఎస్.రూబీ నమ్రత, ఎస్.జోస్లీ బ్లాక్ బెల్ట్ సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కరాటే మాస్టర్స్ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎస్.అప్పలస్వామి ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు హీరో సుమన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

అక్షయ పాత్ర ఆహారం పంపిణీ

పెనుగొండ: వడలిలో అక్షయ పాత్ర సభ్యులు పేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఆదివారం ఇలపర్రు మాజీ సర్పంచ్ కేతా సత్తిబాబు ఇంటి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను అక్షయ పాత్ర సభ్యులు సేకరించి వడలిలో పేదలకు పంపిణీ చేశారు. సమాచారం అందించి సహకరించిన కేతా సత్తిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలపాటి చంటి, కట్టా రామకృష్ణ, తొంటా దుర్గారావులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం సిద్ధాంతం చింతలపాలెం, వడలిలో ఆహారం పంపిణీ చేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు భారీ అన్న సమారాధన నిర్వహించారు. శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో విందు భోజనంలా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పిల్లి దుర్గారావు, కవురు సత్తిబాబు, బొక్కా సత్యనారాయణ, కవురు మురళి, కిట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.



వడలిలో ఆహారం పంపిణీ చేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు

మానవత ఆర్థిక సాయం

పెనుగొండ: డయాలసిస్ పేషెంట్‌కు ఆచంట మానవత శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం దిద్దుపూడి శ్రీనివాస్ డయాలసిస్‌కు ఆర్థికభారం అవుతుండడంతో మానవత ఆధ్వర్యంలో రూ.5 వేలు అందించారు. మండల శాఖ అధ్యక్షుడు లీలాప్రసాద్, కొల్లేపర వెంకన్నబాబు, నెక్కంటి శివన్నారాయణ, యాండ్ర శ్రీని వాస్, కె.శివ, మానేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

19 నుంచి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

యలమంచిలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగంలో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి ఎంపిక పోటీలను ఈ నెల 19 నుంచి నిర్వహిస్తామని ఫెడరేషన్ పాలకొల్లు నియోజకవర్గ కార్యదర్శి రేలంగి రామకృష్ణ యలమంచిలి మండల కార్యదర్శి యాండ్ర సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తారన్నారు. 19, 20, 21 తేదీల్లో మండల స్థాయి, 23, 24 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు.